క్లుప్తంగా

శ్రీక్షేత్రంలో సుదర్శన హోమం



యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో గల శ్రీక్షేత్రంలో విశ్వశాంతి కోసం శుక్రవారం సుదర్శన హోమం నిర్వహించారు. క్షేత్రంలో గల అష్టలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు చామర్తి రమేష్ అచార్యులు, చామర్తి శ్రీనివాస్ రమేష్ అచార్యులు యాగం నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వీఓఏ అవకతవకలపై ఫిర్యాదు



వెలుగు సీసీ దమయంతికి ఫిర్యాదు చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

పూసపాటిరేగ : మండలంలోని చౌడువాడలో మహిళా సంఘాలకు సంబంధించి స్త్రీనిధి రుణాల రీ పేమెంట్‌లో వీఓఏ అవకతవకలకు పాల్పడ్డారని సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు వెలుగు సీసీ దమయంతిని శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన భద్రకాళి, కనకదుర్గ సంఘాల సభ్యులు చెల్లించిన స్త్రీ నిధి రుణాల్లో అదే గ్రామానికి చెందిన వీఓఏ రామలక్ష్మి చేతివాటం ప్రదర్శించిందని ఫిర్యాదులో తెలిపారు. రీ పేమెంట్‌కు ఇచ్చిన నగదులో కొంతమాత్రమే బ్యాంక్‌లో జమచేసి, ఇచ్చిన నగదుకు సరిపడా తప్పుడు రశీదును తమకు ఇచ్చిందని తెలిపారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామానికి చెందిన శీరపు చిన్న, శీరపు రమణమ్మ, ధర్మవరపు నాగమ్మ, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పి. నల్లనయ్య శుక్రవారం పరిశీలించారు. కామాక్షినగర్, కాళీఘాట్ కాలనీ, పావనీనగర్, కేఎల్ పురం , గాజులరేగ, శ్రీనగర్, పుత్సల వీధి, మూడులాంతర్లు, తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. పారిశుధ్య పనులు, సీసీ డ్రెయిన్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు



గ్రామసభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ తిరుపతిరావు

విజయనగరం రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరని ఈఓపీఆర్‌డీ తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెల్లూరులో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రణాళికలు తప్పనిసరిగా రూపొందించుకోవాలని సూచించారు. ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపడితే మంచి ఫలితాలు వస్తాయని చెఅప్పరు. కార్యక్రమంలో ఏపీఓ రవిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

- ఎస్సై గణేష్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: మాదకద్రవ్యాలకు యువత బానిసలుగా మారి తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని ఎస్సై గణేష్ అన్నారు. మండలంలోని ఆల్తిపాలెంలో సంకల్పం పేరుతో 'గురువారం రాత్రి' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది యువత చదువున్న వయసులోనే పెడదోవ పడుతున్నారన్నారు. చెడు అలవాట్లకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను చేజేతులారా నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల భాస్కరరావు, గ్రామ పెద్దలు, యువత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు
- వాడవాడలా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు దంపతులు



నెల్లిమర్ల రూరల్: మొయిదలో దుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



విజయనగరం టౌన్: వనంగుడిలో దుర్గాదేవి



విజయనగరం టౌన్: ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



విజయనగరం టౌన్: పుష్పాలంకరణలో గాజులరేగలో కొలువుదీరిన దుర్గాదేవి

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిదలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ప్రతి ఏటా దుర్గా నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకుడు ధవళ లక్ష్మణరావు, ఆటో యూనియన్ నాయకులు కెల్ల ప్రసాద్, శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న అశోక్ దంపతులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి అశోక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవీ అలంకరణలో..

విజయనగరం టౌన్: గాజులరేగ సాలివీధి మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని 21 రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రదీప్‌శర్మ నేతృత్వంలో హోమాలు, కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి ఆలయంలో కొలువైన దుర్గాదేవి గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి శర్మ , సాయిలు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వసంతవిహార్‌కి చెందిన వసంత గోష్టి మహిళలు ఆలయ ఆవరణలో లలితా, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అలాగే శ్రీచక్ర కుంకుమార్చనలలో పాల్గొని, తరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

జ్ఞానసరస్వతికి విశేషపూజలు..

విజయనగరం టౌన్: రింగురోడ్డు ఎస్‌వీఎన్ నగర్‌లో ఉన్న ధన్వంతరీ, సప్తమేధాగణ, లక్ష్మీభువనేశ్వరీ సహిత జ్ఞానసరస్వతీ ఆలయంలో నిర్వహిస్తున్న 20వ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ముగ్గురు అమ్మవార్లకు విశేష లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం మహాలక్ష్మి స్వరూపమైన గోమాతకు విశేష పూజలు చేశారు. సాయంత్రం అశ్వ వాహన సేవ నిర్వహించారు. అనంతరం నర్తనశాల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణి శిష్యబృందం నిర్వహించిన శాస్త్రీయ నృత్యప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ కిశోర్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె. కిశోర్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గజపతినగరం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు బదిలీపై జామి మండలానికి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఎంపీడీఓ కిశోర్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన వి.శ్రీనివాసరావు

ఏపీఎంగా శ్రీనివాసరావు..

డెంకాడ: వెలుగు ఏపీఎంగా వి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గంట్యాడ ఏపీఎంగా పని చేసిన శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు వెలుగు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన ఏలూరి కనకరాజు (24) అనే యువకుడు ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కనకరాజు కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో అతని తండ్రి నరసింగరావు రూ. 15 లక్షలు అప్పు చేసి వైద్యం చేయించాడు. ఆరోగ్యం కుదుటపడ్డాక అప్పు తీర్చమని తండ్రి కుమారుడు కనకరాజుకు చెప్పాడు. అయితే తనకు కొంత సమయం కావాలని చెప్పిన వ్యక్తి, ఈ నెల ఒకటో తేదీ నుంచి కనిపించకుండా పోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎన్‌వీ ప్రభాకర్ తెలిపారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జనార్దనరావు మృతి





బద్దుకొండ జనార్ధనరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడు (ఇన్‌సెట్లో) మృతుడు జనార్ధనరావు

- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బద్దుకొండ

డెంకాడ: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బద్దుకొండ జనార్దనరావు (67) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ, మోపాడలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. జనార్దనరావు మోపాడ గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, డెంకాడ జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్‌గా, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. జనార్దనరావు కుమారుడు బద్దుకొండ రమేష్ (వైఎస్సార్‌సీపీ నాయకుడు) మోపాడ సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం రమేష్ భార్య కవిత సర్పంచ్‌గా ఉన్నారు.

ప్రముఖుల నివాళి..

నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బద్దుకొండ అప్పలనాయుడుకు మృతుడు జనార్దనరావు స్వయాన పెదనాన్న కుమారుడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు వెంటనే గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బొత్స లక్ష్మణరావు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రోతు సత్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, టీడీపీ నాయకులున్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలకు నగర విద్యార్థులు



రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్–14 కరాటే స్కూల్‌గేమ్స్ పోటీలకు విజయనగరంలోని గురుదత్త ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపికల్లో బి.షణ్ముక శ్రీకర్, ఆర్.గణేష్, కె.శివ గణేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అలాగే అండర్–17 విభాగంలో పి.హేమంత్, బి. రేష్వంత్, ఎస్‌కే సమీర్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన వారిలో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పసుమర్తి పద్మ, డైరెక్టర్లు, శిక్షకుడు సంతోష్‌కుమార్ అభినందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



తప్పెటగుళ్లు కళాకారుల ప్రదర్శన

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో చదురుగుడి, వనంగుడి ఆవరణలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో సీహెచ్.రామచంద్రశేఖర్ భక్తి గీతాలాపన, చనుమల్లు అప్పలనాయుడు, యడ్ల పైడిపునాయుడు ఏకపాత్రాభినయనాలు అలరించాయి. అలాగే రైల్వేస్టేషన్ వద్ద నున్న చదురుగుడి వల్ల భక్తిగీతాలాపన ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను ఆలయ ఈఓ ప్రసాదరావు ఘనంగా సత్కరించారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారికి చోటు



ఆధ్యాప్రశస్తను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ కేపీపీ రాజు, తదితరులు

విజయనగరం టౌన్: మూడేళ్ల ఎనిమిది నెలల వయసు కలిగిన చిన్నారి ఆధ్యాప్రశస్త ప్లాష్‌కార్డ్స్‌లో ఉన్న పదాలు, చిన్న వాక్యాలు, రైమ్స్‌ను 28 నిమిషాల్లో చదివి రికార్డు సృష్టించి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఈ మేరకు ఫోర్ట్ సిటీ స్కూల్‌లో చదువుతున్న చిన్నారిని పాఠశాల చైర్మన్ కేపీపీ రాజు (శివ), వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమలు శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో చిన్నారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా వీధి దీపాల నిర్వహణ



వీధి దీపాల ఏర్పాటును పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలని కమిషనర్ కె. అప్పలరాజు సూచించారు. రామతీర్థం జంక్షన్‌లో హైమాస్ట్ లైట్ల అమరికను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీధి దీపాలు పాడవ్వకుండా చూడాలని సంబంధిత ఏఈలను ఆదేశించారు.

పైడితల్లికి ఘటాలతో నివేదన



క్యూలైన్ల నుంచి ఘటాలతో నేరుగా లోపలికి వస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని వందలాది మంది భక్తులు శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ మేరకు ఘటాలను అమ్మవారికి చూపించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద ఘటాలను ఉంచి, పసుపు, కుంకుమలను సమర్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ డీవీవీ ప్రసాదరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఏపీటీఎఫ్ మహా సభలను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదాశివరావు

నెల్లిమర్ల: ఈ నెల 6,7,8 తేదీల్లో విజయనగరం పూల్‌బాగ్ రోడ్డులోని జగన్నాథ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎస్. చిరంజీవిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సభలకు ఉపాధ్యాయులు, విద్యావంతులు, యువత హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐఎఫ్ఈఏ జాతీయ ఉపాధ్యక్షుడు వై. సత్యం, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ. సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. ఈశ్వర రావు, జిల్లా అధ్యక్షుడు బలరామ్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ పైడిరాజు, సహాధ్యక్షురాలు ఎస్ శ్రీదేవి, సంఘ నాయకులు ఏవీ శ్రీనివాసరావు, యు. శ్రీనివాసరావు, కె. బాలకృష్ణ, సీహెచ్ పైడితల్లి, చినసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీ కుటుంబానికి చేయూత



పార్వతమ్మకు చెక్ అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో పనిచేసి, ఇటీవల మృతిచెందిన హెచ్‌సీ కుటుంబానికి పోలీస్ సిబ్బంది సేకరించిన మొత్తాన్ని చేయూత కింద ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో అందజేశారు. రేగిడి ఆముదాలవలస పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేసిన పి. నారాయణరావు ఆగస్టు 30న అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన భార్య పార్వతమ్మకు రూ. 49 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందేంత వరకు పోలీసుశాఖకి చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కొంతమొత్తాన్ని సేకరించి బాధిత కుటుంబాలకు చేయూతగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఏఎస్‌వీ ప్రభాకరరావు, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య



హాజరైన కార్యదర్శులు,సీఓలు

విజయనగరం: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కార్యదర్శులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ సూర్యఘర్ పథకం ఆవశ్యకత వివరించాలన్నారు. విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2024 ఫిబ్రవరి 13న ప్రారంభించారని చెప్పారు. 2026 – 27 నాటికి ఈ పథకం పూర్తిగా విజయవంతం కావాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. సహజసిద్ధంగా ఉత్పన్నమయ్యే సోలార్ ఎనర్జీ వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని తెలిపారు. జిల్లాలో లక్ష మందితో సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతినెలా కనీసం 300 సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చేలా కృషి చేయాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం 1కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు రూ. 30,000, 2 కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు రూ.60,000, 3 కేవీ సామర్థ్యం గల రూఫ్‌టాప్‌కు 78,000 రూపాయలను రాయితీగా అందిస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ త్రినాథరావు, డీఈఈ కిరణ్‌కుమార్, టీపీఆర్‌ఓ సింహాచలం, సీఎంఎం సన్యాసిరావు పాల్గొన్నారు.

ఇసుక లేక ఇక్కట్లు...



ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు పనుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ఊదరగొట్టిందే తప్ప ఆచరణలో అందించలేకపోయిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ప్రభుత్వం తీరుకు నిరసనగా జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం